ప్రజాకవి కాళోజీకి ఘన నివాళి

తెలంగాణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రజల మనిషి, తన కవిత్వంతో స్వరాష్ట్ర ఆకాంక్షను రగిలించిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవాన్ని నగర వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు.

- సాక్షి నెట్‌వర్క్


వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో కాళోజీకి నివాళులర్పిస్తున్న శాస్త్రవేత్తలు


కేయూలోని పరిపాలన భవనంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, తదితరులు


యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..


నివాళి అర్పిస్తున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు


బల్దియా ప్రధాన కార్యాలయ కౌన్సిల్ హాల్‌లో..


రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..


జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో..


నక్కలగుట్టలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు


హసన్‌పర్తి: నివాళులర్పిస్తున్న స్థానికులు


హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో..


కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ శంకేషి మల్లికార్జున్ తెలిపారు. దేశాయిపేట బొడ్రాయి, లక్ష్మి మెగాటౌన్ షిప్, పైడిపల్లి రోడ్డు, వీవర్స్ కాలనీ, సీకేఎం కళాశాల ప్రాంతాల్లో ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు చాకలి ఐలమ్మ వర్ధంతి

కాజీపేట అర్బన్: వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్నట్లు బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూశాయంపేటలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పుష్పాలతో నివాళులర్పించి, వర్ధంతిని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బీసీ కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని సూచించారు.

అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్లం, హిందీ, గణితం, కంప్యూటర్ సైన్స్, సబ్జెక్టులు బోధించుటకు అతిథి అధ్యాపకుల (4) నియామకానికి కళాశాల విద్యాశాఖ కమిషనర్, రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ అనుమతిచ్చినట్లు ప్రిన్సిపాల్ గుర్రపు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూజీసీ నిబంధనల ప్రకారం సంబంధిత పీజీలో 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హులకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం 5గంటలోపు దరఖాస్తులను నేరుగా రంగశాయిపేట డిగ్రీ కళాశాలలో అందజేయాలని సూచించారు. ఇంటర్వ్యూ, డెమో క్లాసులకు సంబంధించిన వివరాలు అభ్యర్థులకు తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఇద్దరు పరిశోధకులకు డాక్టరేట్


సంధ్యారాణి


సుజాత

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరి పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఏ స్టడీ ఆన్ ఎస్టిమేషన్ ఆఫ్ రిలియబులిటీ ఫర్ స్టాతస్టిక్ స్ట్రెస్ స్ట్రెంథ్ మోడల్స్ అనే అంశంపై గణితశాస్త్ర విభాగం పరిశోధకురాలు సంధ్యారాణి కనికుంట్ల సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. గణిత విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సుమతి ఉమామహేశ్వరి పర్యవేక్షణలో సంధ్యారాణి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.అలాగే, ఇనిస్టిట్యూషన్ ఆఫ్ మ్యారేజి ఇన్ ఇండియా అండ్ మాట్రిమోనియల్ రెమిడీస్ : ఏ స్టడీ విత్ రెఫరెన్స్ టు నాన్ రెసిడెంట్ ఇండియన్స్ (ఎన్‌ఆర్‌ఐ) మ్యారేజెస్ ఇన్ ఇండియా అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కాకతీయ యూనివర్సిటీ లా కళాశాల పరిశోధకురాలు సుజాతకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు నర్సింహాచారి పేర్కొన్నారు. యూనివర్సిటీ లా కళాశాల ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్ పర్యవేక్షణలో సుజాత తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఉత్తమ ఫలితాలతో ముందుకు..



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ఉత్తమ ఫలితాలతో ముందుకెళ్తోందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. కళాశాల 15వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులు ఈ ఇంజనీరింగ్ కళాశాలలో చదివి వివిధ రంగాల్లో స్థిరపడ్డారని గుర్తుచేశారు. కళాశాల అభివృద్ధికి సహకరించిన పూర్వ ప్రిన్సిపాళ్లు, బోధన సిబ్బంది, ఉద్యోగులను అభినందించారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ మాట్లాడుతూ 2009వ సంవత్సరంలో నాలుగు బ్రాంచ్‌లతో ఏర్పాటైయిన ఈ కళాశాల ప్రస్తుతం ఏడు బ్రాంచ్‌లతో విజయవంతంగా నడుస్తోందని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సీహెచ్.రాధిక, డాక్టర్ సుమలత, ఆసిం ఇక్బాల్, లక్ష్మణ్ నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నేతాజీ, లైబ్రరీ అసిస్టెంట్ డాక్టర్ సుజాత, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్వేతార్కుడికి అభిషేకాలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామివారికి పండితులు పంచామృతాలు, ద్వాదశ వర్ణాలతో సోమవారం సహస్ర ధారాభిషేకం నిర్వహించారు. దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. మహిళలు సామూహిక సహస్ర మోదక పూజ నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో తీసిన నేల గంధంతో శ్వేతార్కుడు, ఆది మూలగణపతిపి అభిషేకించారు. అనంతరం భక్తులకు అన్నపూర్ణ కేంద్రంలో మహాన్నదానం చేశారు.

సమాజంలో స్త్రీ పాత్ర విశిష్టమైనది


వీణ ఏసురత్నంను సన్మానిస్తున్న పాస్టర్లు

కాజీపేట రూరల్: సమాజంలో స్త్రీ పాత్ర చాలా విశిష్టమైనదని కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీణ ఏసురత్నం కొనియాడారు. కాజీపేట వెంకటాద్రినగర్‌లోని సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి 2వ ప్రతిష్ఠాపనోత్సవం, స్త్రీల సదస్సు, అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఆదివారం రాత్రి వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా వీణ ఏసురత్నం మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో స్త్రీలు రాణించాలని సూచించారు. రివైవల్ చర్చి పాస్టర్ కురియన్ మాట్లాడుతూ సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ పీటర్ అధ్యక్షన జరిగిన కార్యక్రమంలో వెటర్నరీ సైన్స్ విభాగం డాక్టర్ సునీల్ ఆనంద్‌కుమార్, శాస్త్రవేత్త సౌమ్య, ఇంజనీర్ సంజయ్ సునీల్, ప్రొఫెసర్ దేవదాస్, బాలరాజు, గాదె శ్యామ్, పాస్టర్ షాలిని, స్కిల్ డెవలప్‌మెంట్ ఆర్పీ నఫిసున్నిసా బేగం, పాస్టర్ ఏసురత్నం, ఎ.దానం, సంపత్, రాజేష్, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న ఘనత కమ్యూనిస్టులదే



కాజీపేట: ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్న ఘనత కమ్యూనిస్టు పార్టీలకే దక్కుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.చుక్కయ్య అన్నారు. కాజీపేట పట్టణంలో సోమవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా జిల్లా, రాష్ట్ర కమిటీల పిలుపునకు అనుగుణంగా ఉద్యమ కార్యాచరణతో పనిచేస్తున్న కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. గత పోరాటాలను సమీక్షించుకుని భవిష్యత్తు కార్యాచరణకు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో గాని సాంబయ్య గౌడ్, ఓరుగంటి సాంబయ్య, జి.అనిత, నాగరాజు, ఇందిర, మైదం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పలువురికి జరిమానాలు

రామన్నపేట: వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడుతూ పట్టుబడిన 15 మంది వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.17,200 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 30 మందికి రూ.41,500 జరిమానా విధించినట్లు వివరించారు.

శరీర, అవయవ దానంపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రవణ్

హసన్‌పర్తి: శరీర, అవయవ, నేత్ర దానాలపై హసన్‌పర్తి మండలం చింతగట్టులోని జిల్లా పరిషత్ పాఠశాలలో సదాశయ ఫౌండేషన్, విద్యఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి.శ్రవణ్ మాట్లాడారు. శరీరదాత కాళోజీ స్ఫూర్తిగా 2008లో సదాశయ ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు వివిధ కారణాలతో మరణించిన 125మంది శరీరాలు, 88మంది మృతుల నుంచి అవయవాలు, 1,190 మంది నుంచి నేత్రాలు సేకరించినట్లు వివరించారు. విద్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్లా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాళోజీ జీవితాంతం సమాజహితం కోసం పాటుపడ్డారని కొనియాడారు. ఉపాధ్యాయులు అన్నపూర్ణ, శరత్ బాబు, శేషగిరి స్వామి, నవీన్‌కుమార్, ముజీబ్ పాషా, అర్పిత, ప్రభ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

బాటనీ విభాగం ఇన్‌చార్జ్ అధిపతి శ్రీధర్‌రావుకు సన్మానం



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బాటనీ యూజీ డిపార్టుమెంట్ విభాగం అధిపతిగా కాంట్రాక్టు అధ్యాపకుడు డాక్టర్ శ్రీధర్‌రావును కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి నియమించారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్‌రావును కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, బాధ్యులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు లక్ష్మారెడ్డి, చందులాల్, శ్రీనివాస్, మౌనిక, వేణు, సుమలత, కొమురయ్య, సతీష్ పాల్గొన్నారు.

ఉపాధి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

మామునూరు: విద్యార్థులు ఉపాధి రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఐసీటీ అకాడమీ రాష్ట్ర అధినేత బి.గోపాల్ సూచించారు. ఖిలా వరంగల్ మండల మామునూరులోని బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రముఖ ఇన్ఫోసిస్ కంపెనీ ప్రతినిధి మల్లికార్జున్ అప్ని ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రకాష్ అధ్యక్షతన విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, రిటైల్, ఈ-కామర్స్, లాజిస్టిక్స్, నాలెడ్జ్ ప్రాసెస్, ఔట్ సోర్సింగ్ (కేపీఓ) రంగాల్లో ఉపాధి నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉద్యోగ అవకాశాల మెండుగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ రాజు, జె.స్రవంతి, అశ్విని, గౌస్ పాషా, దినేష్ పాల్గొన్నారు.

12న బీసీ కులాల ఐక్యవేదిక వార్షికోత్సవం



కాజీపేట: ఈనెల12న హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక ప్రథమ వార్షికోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా బాధ్యులు పంకెర్ల కుమారస్వామి యాదవ్ పిలుపునిచ్చారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా సాగుతున్న ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాల్సిన సమయం ఆసన్నమైందని గుర్తుచేశారు. బీసీలు ఒకే తాటిపైకి వచ్చి ఒకే లక్ష్య కోసం పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఐనబోయిని రాజు యాదవ్, ఉప్పు కుమారస్వామి యాదవ్, బోయిని శ్రీనివాస్ యాదవ్, గాదం యాదగిరి, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ పరిసర ప్రాంతం, బస్టాండ్, జూబ్లీ మార్కెట్, రైల్వే ఆలయ వీధిలో జీసస్ ప్రేయర్ హౌస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మరియదాస్ ఆధ్వర్యంలో అనాథలకు అన్నం ప్యాకెట్లను పంపిణీ సోమవారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసునూరి మనోహర్ మాట్లాడుతూ జీసస్ ప్రేయర్ హౌస్ నిర్వాహకుడు మరియదాస్ పదేళ్ల నుంచి తన సొంత ఖర్చులతో అనాథలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో పాస్టర్ కుమార్, రాజేష్, కృష్ణ ఫర్, సూర్య, పాలిమారి గోపి, కోంద్ర తిరుపతి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే నాయిని



హన్మకొండ: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి ఈవీ.శ్రీనివాస్ రావు కలిశారు. హైదరాబాద్‌లో మహేష్ కుమార్ గౌడ్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

హసన్‌పర్తి: మహేష్ కుమార్‌గౌడ్‌ను వంగపహాడ్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోలం అనిల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మార్త రవీందర్ సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చెరువు మత్తడి.. సందర్శకుల తాకిడి


చేపలు పడుతున్న మత్స్యకారులు, స్థానికులు

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి శివారులోని రేణుక ఎల్లమ్మ చెరువు నిండుకుండలా మారింది. మత్తడి దూకుడును చూసేందుకు జనం భారీగా తరలివస్తున్నారు. యువతీయువకులు సెల్ఫీలు తీసుకుంటూ కేరింతలు కొడుతూ సందడి చేస్తున్నారు. మరోవైపు మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్నారు. మత్తడి వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ సిబ్బంది రక్షణ చర్యలు చేపట్టారు. తహసీల్దార్ బావుసింగ్, సీఐ సుధాకర్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి చెరువు పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. కాగా, మత్తడి పారుతుండడంతో సుబ్బయ్యపల్లె, రంగులకంపెనీ, ఉనికిచర్ల గ్రామాలకు తాత్కాలికంగా రాకపోకలు నిలిచిపోయాయి.

సొసైటీ కాలనీలో వెలగని వీధి దీపాలు



కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ కాశిబుగ్గ సొసైటీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. దాంతో కాలనీలో అంధకారం నెలకొందని కాలనీవాసులు వాపోతున్నారు. నెల రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగపోడవంతో చీకటి నెలకొని ప్రమాదాలు, దొంగతనాలు జరిగే అవకాశం ఉందని అంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మావో పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి


మావోకు నివాళి అర్పిస్తున్న సూరి, నాయకులు


వరంగల్: వరంగల్ ఇఫ్టూ కార్యాలయంలో..

హన్మకొండ: తాడిత, పీడిత ప్రజలంతా కామ్రేడ్ మావో పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి పిలుపునిచ్చారు. హనుమకొండలోని జిల్లా బస్‌స్టేషన్ కూడలిలో మార్కిస్ట్ మహోపాధ్యాయుడు, చైనా విప్లవ రథసారధి మావో 48వ వర్ధంతిని సోమవారం జరుపుకున్నారు. ముందుగా మావో చిత్రపటానికి చిర్ర సూరి, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సూరి మాట్లాడుతూ ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందించడంలో పూర్తిగా విఫలమయ్యాయని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు అర్షం అశోక్, మైదం పాణి, శంకర్, వెంకన్న పాల్గొన్నారు.

ప్రజా విముక్తి పోరాటాలను బలోపేతం చేద్దాం

వరంగల్: జన చైనా ప్రజల విముక్తి పోరాటాల నిర్మాత కామ్రేడ్ మావో జెండాంగ్ స్ఫూర్తితో ప్రజా దోపిడీ విముక్తి పోరాటాలను బలోపేతం చేద్దామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆరెల్లి కృష్ణ పిలుపునిచ్చారు. వరంగల్ ఎల్‌బీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో మావో 48వ వర్ధంతి సందర్భంగా మావో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ దేశంలో పెరిగిపోతున్న కుల, మత ఘర్షణలు, దోపిడీ పాలకవర్గాల సృష్టేనని అన్నారు. విజయ్ కన్నా, మొగిలి వెంకటరెడ్డి, మిస్త్రీన్, గ్రేటర్ రాచకొండ రంజిత్, ముషారఫ్, అర్జున్, వంశీకృష్ణ, జీవన్ పాల్గొన్నారు.

ఆటపాటలే ప్రజా పోరాటానికి ఊపిరి


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

ఖిలా వరంగల్: ప్రజా కవి, రచయిత, గాయకుడు సుద్దాల హనుమంతు.. నిజాం పాలకులను ఎదిరించి, తన ఆటపాటలతో ప్రజా పోరాటానికి ఊపిరిగా నిలిచారని తెలంగాణ ప్రజా న్యాటమండలి జిల్లా గౌవర అధ్యక్షుడు గన్నారపు రమేష్ కొనియాడారు. వరంగల్ శివనగర్ తమ్మెర భవనలో తెలంగాణ ప్రజా నాట్య మండలి వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షురాలు బత్తుల సుప్రియ అధ్యక్షతన అమర కళాకారుల సంస్మరణ సభ సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై అమర వీరులకు నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో జమీందార్లకు వ్యతిరేకంగా వీర గాథలను సుద్దాల హనుమంతు, సుద్దాల కవిత గళమెత్తారని, పల్లె పాటలతో ప్రజల్లో చైతన్యం నింపారని గుర్తు చేశారు. అమర కళాకారుల ఆలోచనలు, ఆశయాలను పార్టీ కార్యకర్తలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, మున్నీ, సాంబలక్ష్మి, యాదగిరి, సుమలత, వసంత, శాంతి, లలిత, రజిత, శ్రీలత, కన్య, విమల, స్వప్న, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

బండ్‌పై అమర కళాకారుల విగ్రహాలు పెట్టాలి

నయీంనగర్: భద్రకాళి బండ్‌పై వరంగల్ జిల్లా అమర కళాకారుల విగ్రహాలు ప్రతిష్ఠించాలని ఓరుగల్లు కళా శిఖరాల సంఘం అధ్యక్షుడు జూపాక శివ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సకల కళలను కాపాడుకుంటూ, కళాకారుల ఐక్యత కోసం ఓరుగుల్లు కళా శిఖరాలు నూతన సంఘం ఆవిర్భవించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ రమేష్, కళాకారులు దారా దేవేందర్, వెన్నెల శ్రీనాథ్, రాజేందర్, వాజిద్ హుస్సేన్, బుచ్చన్న, రాజేందర్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో మానవ వనరులే కీలకం


సమావేశంలో శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: దేశాభివృద్ధిలో మానవ వనరులే కీలకమని కాకతీయ యూనివర్సిటీ ప్రభుత్వ పాలన, మానవ నరుల విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాస్‌రావు అన్నారు. ఆ విభాగం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు సోమవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవస్థ నిర్మాణం, పటిష్టత, వ్యవస్థ ఉన్నతికి మానవ వనరులే క్రియాశీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మానవ వనరుల విభాగం విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని వివరించారు. విభాగం బీఓఎస్ ప్రొఫెసర్ యాద గిరిరావు, అధ్యాపకులు చీకటి శ్రీను, బుర్రి ఉమా శంకర్, మోహన్, ప్రవీణ్‌కుమార్, తేజావత్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రజలను దోచుకుంటున్న ప్రైవేట్ ఆస్పత్రులు'


వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

హన్మకొండ అర్బన్: వైద్యం పేరుతో ప్రజలను దోచుకుంటున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ ఆస్పత్రులకు రోగులు పంపుతూ కమిషన్లు తీసుకుంటున్న ఆర్‌ఎంపీ, పీఎంపీల వ్యవస్థను రద్దు చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) జిల్లా కార్యదర్శి డి.తిరుపతి కోరారు. ఈమేరకు జిల్లా నాయకులతో కలిసి హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇష్టానుసారంగా ఓపీ ఫీజులు, టెస్టులతో ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అవసరం లేకున్నా టెస్టులు, స్కానింగ్‌లు చేస్తూ, ఆపరేషన్, అడ్మిషన్ల, అడ్వాన్సుల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరంజీవి, కమిటీ సభ్యుడు మాటూరు సతీష్ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి బలవన్మరణం

మడికొండ: ఉరి వేసుకొని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మడికొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ పోలీసు స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న దివాకర్ కుమారుడు వరికోటి కార్తీక్ (32) ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజబాబు తెలిపారు. కార్తీక్ ఆత్మహత్య గల వివరాలు తెలియాల్సి ఉంది.

సీపీని కలిసిన ఎస్సైలు

వరంగల్ క్రైం: కమిషనరేట్ పరిధిలోని చెన్నారావుపేట, వంగర పోలీస్‌స్టేషన్లలో ఎస్సైలుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాకేష్‌రెడ్డి, దివ్య సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పుష్పగుచ్ఛాలు అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని వారికి సీపీ సూచించారు.